కలం
ప్రజల గళం...
kalamdaily.com
Follow on: Kalamtelugu
మంగళవారం • 28-04-2026
పేజీలు: 5
360° SINGLE TOPIC
డీజిల్ షార్టేజ్

# డీజిల్ బాంబ్!




## రాష్ట్రంలో వెక్కిరిస్తున్న నో స్టాక్ బోర్డులు

### ధాన్యం తరలించేందుకు లారీలకు డీజిల్ కొరత

### ఎమర్జెన్సీ సేవలకూ తగిలిన సెగ

### ఆంధ్రప్రదేశ్‌లో సగం బంకులు క్లోజ్

### తెలంగాణలోనూ మూతపడుతున్న పంపులు

అమెరికా-ఇరాన్ యుద్ధంతో నిన్నమొన్నటిదాకా ఎల్పీజీ సంక్షోభం ఏర్పడింది. ఇప్పటికీ ఆ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. ఇంతలోనే డీజిల్ కొరత ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం అలాంటి షార్టేజీ ఏమీ లేదంటున్నాయి. ఎల్పీజీ సరఫరాగానీ, పెట్రోల్, డీజిల్ సరఫరాగానీ తగ్గలేదని గంభీర ప్రకటనలు చేస్తున్నాయి. యథావిధిగా డిమాండ్‌కు తగినంత సప్లై ఉందని పదేపదే ప్రకటిస్తున్నాయి. గ్రౌండ్ రియాలిటీ మాత్రం అందుకు భిన్నంగా ఉన్నది. ఈ పరిస్థితి కొరత వల్ల రాలేదని, ప్రజల్లో నెలకొన్న ఆందోళనతో ఏర్పడిన ప్యానిక్ క్రైసిస్ అని పేరు పెట్టాయి.

ఎల్పీజీ సంక్షోభంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ప్రైవేటు మెస్‌లు, రోడ్‌సైడ్ ఈటరీస్, ఫుట్‌పాత్ స్టాళ్లు టీ మొదలు బిర్యానీ వరకు అన్నింటి రేట్లు పెంచేశాయి. అవి రెగ్యులర్‌గా వాడే కమర్షియల్ సిలిండర్లు అవసరం మేరకు సరఫరా కాకపోవడంతో డబుల్ రేటు పెట్టి బ్లాక్‌లో కొనాల్సి వస్తున్నదనేది యజమానుల వాదన. తూచ్... సప్లైలో ఎక్కడా తేడా లేదంటున్నాయి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు. ఇటు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సైతం రోజువారీ బులెటిన్లలో ఎల్పీజీ, పెట్రోలు, డీజిల్ సప్లై, డిమాండ్, సేల్స్ గణాంకాలను ప్రకటిస్తూ సంక్షోభం లేదనే భరోసా కల్పిస్తున్నాయి.

కాగితాల మీద లెక్కలు ఎలా ఉన్నా క్షేత్రస్థాయిలో జరుగుతున్నది మాత్రం ఇందుకు భిన్నం. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల అవసరాలకు తగినంత డీజిల్, పెట్రోల్ సప్లై లేకపోవడంతో దాదాపు 10% బంకులు మూతపడ్డాయి. దీంతో సరిహద్దుగా ఉన్న తెలంగాణలోని బంకులపై ఒత్తిడి పెరిగింది. జిల్లాల నుంచి ఆ ప్రెషర్ హైదరాబాద్ సిటీ వరకూ వ్యాపించింది. నగరంలోని కొన్ని పెట్రోలు బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తే మరికొన్ని మూతపడ్డాయి. అయినా సివిల్ సప్లైస్ డిపార్టుమెంట్ మాత్రం అబ్బే... కొరతా లేదు.. సంక్షోభం లేదు.. ఏ బంకూ మూతపడలేదు.. అని ప్రకటిస్తున్నది.

ఇప్పటివరకూ ఎల్పీజీ సంక్షోభంతో ఆహార పదార్థాల రేట్లు మాత్రమే పెరిగాయి. ఇప్పుడు డీజిల్ క్రైసిస్‌తో కూరగాయలు మొదలు నిత్యావసర వస్తువులను సరఫరా చేయడంలో చిక్కులు ఏర్పడ్డాయి. రవాణా ఛార్జీలు పెరుగుతున్నాయి. చివరకు వినియోగదారులపై ధరల పెరుగుదల భారం పడుతున్నది. నగరం నుంచి జిల్లాలకు, పొరుగు రాష్ట్రాలకు ప్రతి నిత్యం వెళ్ళే వేలాది ట్రావెల్స్ బస్సుల్లో టికెట్ ధరలు పెరిగాయి. డీజిల్ కొరతతో కొన్ని సర్వీసులు తగ్గిపోయాయి. ప్రైవేటు వాహనాలకూ డీజిల్ ఇబ్బందులు తలెత్తాయి. హైవేల మీద బంకుల్లో నో స్టాక్ బోర్డులు తప్పడంలేదు.

రాష్ట్రంలో రోజుకు ఎన్ని లీడర్ల డీజిల్, పెట్రోలు అవసరం?.. సప్లై ఎంత ఉంటున్నది?.. ఎందుకు డిమాండ్ పెరుగుతున్నది?.. బంకుల్లో నో స్టాక్ బోర్డులు ఎందుకు కనిపిస్తున్నాయి?.. ప్రభుత్వ లెక్కలు ఎలా ఉన్నాయి?.. గ్రౌండ్ రియాలిటీ ఏంటి?.. కలం 360 డిగ్రీస్ స్పెషల్.

- తెలంగాణ బ్యూరో, కలం



హైదరాబాద్‌లోని ఓ పెట్రోల్ బంక్ వద్ద క్యూ..

## ఆదివారం 1.44 కోట్ల లీటర్ల డీజిల్ సప్లై

తెలంగాణ ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం..26వ తేదీన 95.74 లక్షల లీటర్ల పెట్రోల్ సప్లై జరిగింది. ఇక రవాణా, వ్యవసాయ రంగాలకు అత్యంత కీలకమైన డీజిల్ విషయానికి వస్తే 1.44 కోట్ల లీటర్ల సరఫరా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కలిపి ఆదివారం 2.40 కోట్ల లీటర్ల ఇంధనం బంకులకు సప్లై అయింది. 27వ తేదీన సాయంత్రం 4 గంటల వరకు పెట్రోల్ 74.43 లక్షల లీటర్లు, డీజిల్ 1.10 కోట్ల లీటర్ల ఆయిల్‌ను కంపెనీలు బంకులకు సప్లై చేశాయి.



## బంకులకు వాహనదారుల క్యూ

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ఏర్పడబోతోందన్న వదంతులు వ్యాపించడంతో వాహనదారులు బంకుల వద్ద క్యూ కడుతున్నారు. సరిహద్దు జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తున్నది. చమురు సంస్థల నుంచి డిపోలకు సరఫరా సాఫీగానే జరుగుతోందని, ప్రజలు అవసరానికి మించి కొనుగోలు చేయడం వల్లే కొన్ని బంకుల్లో స్టాక్ త్వరగా అయిపోతోందని అధికారులు చెప్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ నిల్వలు సరిపడా ఉన్నాయని, వాహనదారులు ఆందోళన చెందాల్సిన పని లేదని అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్తున్నా.. క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉన్నది. ఇప్పటికే రాష్ట్ర సరిహద్దుల్లోని పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనం ఇస్తున్నాయి.

- సోషల్ మీడియాలో ఇంధన కొరత రాబోతోందనే వార్తలు ప్రచారం కావడంతో, వాహనదారులు ఒక్కసారిగా బంకుల వద్దకు చేరుకుంటున్నారు.
- కొరత వస్తుందనే భయంతో జనం తమ వాహనాల ట్యాంకులను ఫుల్ చేయించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. దీంతో బంకుల్లో ఉండే రోజువారీ నిల్వలు నిర్ణీత సమయం కంటే ముందే అయిపోతున్నాయి. ఫలితంగా కొన్ని చోట్ల నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి.
- కొన్ని జిల్లాల్లో డిపోల నుంచి బంకులకు ట్యాంకర్లు రావడంలో స్వల్ప సాంకేతిక కారణాలు లేదా రవాణా జాప్యంతో గంటల వ్యవధిలో వెయిటింగ్ కనిపిస్తున్నది.
- గ్యాస్ బుకింగ్‌లో ఇప్పటికీ ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారం.. గృహ అవసరాల కోసం సిలిండర్ బుక్ చేసిన తర్వాత, నెక్స్ట్ బుకింగ్ చేయడానికి గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులు, పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కనీస గడువు తప్పనిసరి చేసింది.
- గ్యాస్ సిలిండర్ల డిమాండ్ ఒక్కసారిగా పెరగడంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 లక్షలకు పైగా బుకింగ్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తున్నది. గతంలో బుకింగ్ చేసిన రెండు మూడు రోజుల్లోనే వచ్చే సిలిండర్.. ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో 2 నుంచి 3 వారాల సమయం పడుతున్నది.
- పానిక్ బుకింగ్, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడానికి ఆయిల్ కంపెనీలు కొత్త గ్యాస్ కనెక్షన్లను కూడా తాత్కాలికంగా నిలిపివేశాయి.

# ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్‌పై ప్రభావం

రాష్ట్రంలో డీజిల్ కొరత కేవలం వాహనదారులకే కాకుండా.. మొత్తం ఆర్థిక వ్యవస్థపై చెయిన్ రియాక్షన్ చూపిస్తున్నది. డీజిల్ కొరత కారణంగా రవాణా రంగం ఎక్కువ ఎఫెక్ట్ అవుతున్నది. వ్యవసాయ, పారిశ్రామిక, ఆక్వాకల్చర్ వంటి సెక్టార్లపైనా డీజిల్ కొరత ఎఫెక్ట్ పడింది.

- డీజిల్ కొరత వల్ల వెంటనే దెబ్బతినేది రవాణా రంగం. కూరగాయలు, పాలు, బియ్యం వంటి నిత్యావసరాలను గ్రామాల నుంచి పట్టణాలకు చేర్చే లారీలు, వ్యాన్‌లు నిలిచిపోయాయి. రవాణా ఖర్చులు పెరగడంతో మార్కెట్‌లో వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయి.
- ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ సర్వీసులకు డీజిల్ కీలకం. సరఫరా తగ్గితే బస్సు సర్వీసులు తగ్గడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- ఈ కామర్స్, కొరియర్ సర్వీసులు పూర్తిగా డీజిల్ వాహనాలపైనే ఆధారపడి ఉన్నాయి. సప్లైలో అంతరాయం ఏర్పడటంతో ఆన్‌లైన్ ఆర్డర్లు, అత్యవసర పార్సిల్స్ పంపిణీ ఆగిపోయాయి. ఇది వ్యాపార లావాదేవీలను దెబ్బతీస్తున్నది.
- నిర్మాణ రంగంపైనా ప్రభావం పడింది. ఇసుక, సిమెంట్, ఐరన్ వంటి ముడి సరుకును తరలించే టిప్పర్లు, లారీలు నిలిచిపోయాయి. దీంతో పనులు ఆలస్యమై ఖర్చు భారీగా పెరిగిపోతున్నది.
- ఎమర్జెన్సీ సేవలపైనా డీజిల్ కొరత ప్రభావం పడింది. కొన్ని ప్రైవేట్ అంబులెన్స్‌లు, మొబైల్ హెల్త్ క్లినిక్‌లు డీజిల్ కొరత వల్ల సకాలంలో స్పందించడంమ లేదు. డీజిల్ సప్లై చైన్ తెగడంతో అన్ని వర్గాలపై ప్రభావం పడింది.
- విద్యుత్ సరఫరా సరిగ్గా లేని ప్రాంతాల్లో పొలాలకు నీరు పెట్టేందుకు ఉపయోగించే డీజిల్ ఇంజిన్లు ఆగిపోయాయి.
- ఫ్యాక్టరీలు, ఐటీ కంపెనీలు, హాస్పిటల్స్‌లో కరెంట్ సప్లైలో అంతరాయం కలిగినప్పుడు భారీ జనరేటర్ల కోసం డీజిల్ వాడుతుంటారు. కొరత ఏర్పడటంతో ఉత్పత్తి ఆగిపోయింది. అత్యవసర సేవలకు ఆటంకం కలుగుతున్నది. పరిశ్రమలకు కావాల్సిన ముడి సరుకు రవాణా నిలిచిపోయాయి.
- తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో చేపలు, రొయ్యల చెరువులకు ఆక్సిజన్ అందించే ఏరేటర్లను నడపడానికి డీజిల్ జనరేటర్లను ఉపయోగిస్తున్నారు. డీజిల్ కొరత ఏర్పడితే చెరువుల్లోని చేపలు/రొయ్యలు చనిపోయి రైతులకు భారీ నష్టం వాటిల్లుతుంది.





## వంట గదిపై ప్రభావం!

డీజిల్ ధర పెరిగినా లేదా కొరతతో లారీలు నిలిచిపోయినా.. ఆ ప్రభావం నేరుగా వంటగదిపై పడింది. ఒక వస్తువు ధర నిర్ణయించేటప్పుడు దాని తయారీ ఖర్చుతో పాటు రవాణా ఖర్చును కూడా కలుపుతారు. ఉదాహరణకు కర్నూలు నుంచి హైదరాబాద్‌కు ఉల్లిగడ్డలు రావడానికి లారీ అద్దె పెరిగితే.. ఆ పెరిగిన మొత్తాన్ని వ్యాపారి అతని జేబులోంచి భరించడు. ఆ భారాన్ని కిలో ఉల్లిగడ్డల ధరపై రూ.5 నుంచి రూ.10 వరకు పెంచి వినియోగదారుడి నుంచి వసూలు చేస్తున్నాడు.

- రవాణా చార్జీలు భరించలేక లేదా డీజిల్ దొరకక లారీ ఓనర్లు వాహనాలను నిలిపేశారు. దీంతో మార్కెట్‌కు వచ్చే సరుకు క్వాంటిటీ తగ్గిపోయింది.
- డీజిల్ కొరత కేవలం తయారైన వస్తువులే కాదు, వాటి తయారీకి కావాల్సిన ముడి సరుకులపై కూడా భారం పడుతున్నది. ఉదాహరణకు.. ఒక బియ్యం మిల్లుకు వడ్లు తరలించడానికి, ఆ ప్యాక్ చేసిన బియ్యాన్ని మార్కెట్‌కు చేర్చడానికి రెండు సార్లు రవాణా అవసరం. ఈ రెండు దశల్లో పెరిగిన చార్జీలు అంతిమంగా కిలో బియ్యం ధరపై ప్రభావాన్ని చూపుతున్నాయి.
- సరుకు రవాణా చేసేటప్పుడు కేవలం ఇంధనమే కాదు.. ఆ సరుకును లోడ్ చేసే హమాలీలు, ప్యాకేజింగ్ మెటీరియల్ రవాణా కూడా ఖరీదవుతున్నది. ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉండటంతో పరోక్షంగా ప్రతి వస్తువుపై 5% నుంచి 15% వరకు అదనపు భారం పడుతున్నది.

## మౌలిక సదుపాయాలపై ఎఫెక్ట్

- గ్రామీణ, కొండ ప్రాంతాల్లోని సెల్ ఫోన్ టవర్లు.. విద్యుత్ లేనప్పుడు డీజిల్ జనరేటర్లపైనే నడుస్తాయి. డీజిల్ దొరకకపోతే సిగ్నల్ వ్యవస్థ దెబ్బతిని కమ్యూనికేషన్ స్తంభించే చాన్స్ ఉంది.
- ఐటీ కంపెనీల సర్వర్లు, డేటా సెంటర్లు నిరంతరాయంగా పనిచేయాలి. ఒక్క నిమిషం పవర్ పోయినా బ్యాకప్ కోసం డీజిల్ ఉండాల్సిందే. లేదంటే ఆన్‌లైన్ బ్యాంకింగ్, వెబ్‌సైట్లు పనిచేయవు.
- పట్టణాల్లో ప్రతిరోజూ చెత్తను సేకరించే ఆటోలు, ట్రక్కులు డీజిల్‌తోనే నడుస్తాయి. ఇవి నిలిచిపోయాయి.
- కొన్ని ప్రాంతాల్లో నీటిని పంపింగ్ చేయడానికి భారీ డీజిల్ మోటార్లను వాడుతుంటారు. వాటికి ఇంధనం అందకపోతే తాగునీటి ఎద్దడి తలెత్తుతున్నది.
- త్వరగా పాడైపోయే వస్తువులైన మాంసం, గుడ్లు, పువ్వులు, కొన్ని రకాల ఔషధాలను నిల్వ చేసే కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు డీజిల్ జనరేటర్లపై ఆధారపడతాయి. ఇంధనం లేక ఇవి ఆగిపోతే కోట్లాది రూపాయల విలువైన సరుకు వృథా అవుతున్నాయి.
- పెద్ద లారీల నుంచి చిన్న వ్యాన్లు, ఆటోల ద్వారా గల్లీల్లోని కిరాణా దుకాణాలకు సరుకు చేరుతుంది. డీజిల్ లేక ఈ గొలుసు తెగిపోయి స్థానిక దుకాణాల్లో వస్తువుల కొరత ఏర్పడింది.





## రైతన్న గుండెలో గుబులు

ప్రస్తుతం రాష్ట్రంలో యాసంగి వడ్ల కోతలు, ధాన్యం సేకరణ ముమ్మరంగా సాగుతున్న సమయం. డీజిల్ కొరత నేరుగా రైతాంగంపై, సేకరణ వ్యవస్థపై పెను ప్రభావం చూపుతున్నది. చూపుతుంది. తెలంగాణ పౌరసరఫరాల శాఖ, రవాణా శాఖ అంచనాల ప్రకారం.. యాసంగి సీజన్‌లో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించడానికి 17,200 లారీలను సిద్ధం చేశారు.

- రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,500 కొనుగోలు కేంద్రాల నుంచి సుమారు 90 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- ఒక్కో లారీ సగటున 2 నుంచి 3 ట్రిప్పులు (దూరాన్ని బట్టి) వేస్తుంది. మొత్తం లారీలు నిరంతరాయంగా కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తీసుకెళ్తున్నాయి. దీనికి పెద్ద మొత్తంలో డీజిల్ కావాలి.
- ధాన్యం లోడ్ చేసిన లారీ సగటున లీటర్‌కు 3 నుంచి 4 కిలో మీటర్ల మైలేజీ మాత్రమే ఇస్తుంది. ఒక్కో లారీ ప్రయాణ దూరాన్ని బట్టి రోజుకు సగటున 100 లీటర్ల డీజిల్ అవసరం. కేవలం ధాన్యం రవాణా కోసమే రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు సుమారు 12 నుంచి 15 లక్షల లీటర్ల డీజిల్ అవసరం.
- లారీలు సకాలంలో రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. దీంతో రైతులు వారాల తరబడి అక్కడే వేచి ఉండాల్సి వస్తున్నది.
- పొలాల్లో వడ్లు కోసే హార్వెస్టర్లకు కూడా డీజిల్ కీలకం. ఒక్కో హార్వెస్టర్ గంటకు 15 లీటర్ల డీజిల్ వాడుతున్నది. డీజిల్ దొరక్క కోతలు ఆగిపోయాయి. పొలాల్లోనే ధాన్యం రాలిపోయే పరిస్థితి ఏర్పడింది.
- రాష్ట్రంలో రోజూ సరఫరా అవుతున్న 1.44 కోట్ల లీటర్ల డీజిల్‌లో వ్యవసాయ రంగానికే ఎక్కువ సప్లై అవుతున్నది.




2026, ఏప్రిల్ 1 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 4,281 పెట్రోల్ పంపులు ఉన్నాయి. 2023తో పోలిస్తే 6.38 శాతం పెట్రోల్ పంపులు పెరిగాయి. మొత్తం బంకుల్లో సింగిల్ ఓనర్ (సొంత) బంకులు 2,503 (58.47 శాతం) ఉన్నాయి. కంపెనీ/బ్రాండెడ్ బంకులు 1,778 (41.53 శాతం) ఉన్నాయి.

## టీ, టిఫిన్ ధరలు మరింత పైకి!

గ్యాస్ కొరతకు డీజిల్ కొరత కూడా తోడైతే.. టీ, టిఫిన్ ధరలు ఇంకా పెరిగాయి. ఇరాన్ వార్ ఎఫెక్ట్ కారణంగా ఇప్పటికే గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగా అన్ని హోటల్స్‌లో టిఫిన్లు, మీల్స్ ధరలు పెంచేశారు.

- హోటళ్లకు ప్రతి రోజు కూరగాయలు, పాలు రావాలి. డీజిల్ కొరత వల్ల ట్రాన్స్‌పోర్ట్ ఆగడంతో వీటి లభ్యత తగ్గి ధరలు పెరిగాయి. బియ్యం, నూనె, పప్పుల రవాణా చార్జీలు పెరగడంతో హోటల్ నిర్వాహకులపై పెట్టుబడి భారం రెట్టింపు అయింది. ఆ భారం వినియోగదారుల నుంచే వసూలు చేస్తున్నారు.
- ఇప్పటికే గ్యాస్ కొరత కారణంగా 10 రూపాయలు ఉన్న టీ.. 15 రూపాయలు అయింది. డీజిల్ లేక ట్రాన్స్‌పోర్టేషన్ దెబ్బతినడంతో పాలు, చక్కెర సప్లై ఆగిపోయింది. దీంతో టీ ధర మరింత పెరిగింది.
- పాల పంపిణీ వ్యాన్‌లకు డీజిల్ దొరక్కపోవడంతో నగరాల్లో పాల ప్యాకెట్ల కొరత ఏర్పడుతున్నది. దీంతో కొన్ని చోట్ల టీ దుకాణాలు మూతపడ్డాయి.
- ఇప్పటికే గ్యాస్ సిలిండర్ల డెలివరీలో జాప్యం ఉంది. దీనివల్ల హోటళ్లు బ్లాక్ మార్కెట్‌లో ఎక్కువ ధర పెట్టి సిలిండర్లు కొనాల్సి వస్తోంది.



## స్టాక్ ఫుల్ అంటున్న తెలంగాణ ప్రభుత్వం

తెలంగాణలో ఇంధన కొరత లేదని, అంతా సవ్యంగానే ఉందంటూ పౌరసరఫరాల శాఖ ప్రకటనలు చేస్తున్నది. అధికార యంత్రాంగం 'ఆల్ ఈజ్ వెల్' అని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో సామాన్యుడి పరిస్థితి మాత్రం భిన్నంది ఉన్నది.

- ప్రభుత్వ లెక్కల ప్రకారం రోజుకు 95.74 లక్షల లీటర్ల పెట్రోల్ సరఫరా జరుగుతున్నదని చెప్తున్నా.. ఆ స్టాక్ అంతా ఎక్కడికిపోతున్నది? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. రోజుకు 1.44 కోట్ల లీటర్ల డీజిల్ అందుబాటులో ఉందనేది ప్రభుత్వ వాదన. కానీ, హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఆదివారం సాయంత్రం 6 గంటలకే నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ గణాంకాలు కాగితాల మీద వెలుగులు విరజిమ్ముతుంటే, బంకుల వద్ద మాత్రం చీకట్లు అలముకుంటున్నాయి.
- ప్రజలు భయంతో కొంటున్నారని నెపం వారిపైనే నెడుతున్నది ప్రభుత్వం. గంటల తరబడి ఆటోలు, బస్సులు క్యూలో నిలబడుతున్నాయంటే అది ప్రజల భయం కాదు, ప్రభుత్వ వైఫల్యం.
- ఫిర్యాదుల కోసం ఇచ్చిన టోల్-ఫ్రీ నంబర్లు మోగవు. మోగినా సమస్య పరిష్కారం కావడం లేదు.

## ప్రకటనలకే పరిమితమైన కేంద్రం

దేశంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని.. అసలు కొరతే లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి చెప్తున్నారు. కేంద్రం చెబుతున్న 60 రోజుల స్టాక్ లెక్కలకు, బంకుల వద్ద గంటల తరబడి పడిగాపులు కాస్తున్న సామాన్యుడి కష్టానికి ఎక్కడా పొంతన కుదరడం లేదు.

- కేంద్ర ప్రభుత్వం సోషల్ మీడియాలో వచ్చే వార్తలను దుష్ప్రచారం అని కొట్టిపారేస్తోంది. స్టాక్ ఉందని కేంద్రం అంటుంటే, నో స్టాక్ అని బంకుల యాజమాన్యం చెబుతోంది. కేంద్రం సరఫరా గొలుసు సవ్యంగా ఉందని బుకాయిస్తుంటే.. పంపిణీ నెట్‌వర్క్‌లో ఉన్న లోపాలు సామాన్యుడిని వేధిస్తున్నాయి.
- యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ చమురు నిల్వలపై భరోసా కల్పించాల్సింది పోయి, సమస్యను కేవలం 'మిస్-ఇన్ఫర్మేషన్'అని తేల్చేస్తోంది.
- గ్యాస్ సిలిండర్ల సరఫరా 2.5 రోజుల్లోనే జరుగుతోందని కేంద్రం చెబుతోంది. కానీ, గ్రౌండ్ లెవల్‌లో పరిస్థితి భిన్నంగా ఉంది. ఢిల్లీ నుంచి గల్లీ వరకు హోటళ్లు, క్యాంటీన్లు కమర్షియల్ సిలిండర్ల కోసం నానా తంటాలు పడుతున్నాయి. గృహ అవసరాల సిలిండర్ల బుకింగ్ జరిగినా.. పంపిణీలో వారం రోజుల జాప్యం జరుగుతోందన్నది.

## సౌత్ ఇండియా -2024-25 (లక్షల టన్నుల్లో వినియోగం)

| | డీజిల్ సేల్స్ | పెట్రోల్ |
|---|---|---|
| ఏపీ | 35.12 | 16.27 |
| కర్ణాటక | 82.58 | 30.54 |
| కేరళ | 24.19 | 18.79 |
| పాండిచ్చేరి | 5.84 | 1.92 |
| తమిళనాడు | 63.43 | 35.33 |
| తెలంగాణ | 36.47 | 18.01 |
| మొత్తం | 247.86 | 120.89 |

## సౌత్ ఇండియా -2025-26 (లక్షల టన్నుల్లో వినియోగం)

| | డీజిల్ సేల్స్ | పెట్రోల్ |
|---|---|---|
| ఏపీ | 37.64 | 17.13 |
| కర్ణాటక | 82.38 | 32.20 |
| కేరళ | 24.95 | 19.82 |
| పాండిచ్చేరి | 6.01 | 2.07 |
| తమిళనాడు | 67.67 | 37.97 |
| తెలంగాణ | 37.64 | 19.02 |
| మొత్తం | 256.48 | 128.23 |

## సౌత్ ఇండియా వినియోగం 2026-27 (అంచనాలు)

| | డీజిల్ సేల్స్ | పెట్రోల్ |
|---|---|---|
| ఏపీ | 38.33 | 17.83 |
| కర్ణాటక | 83.28 | 33.94 |
| కేరళ | 25.29 | 20.85 |
| పాండిచ్చేరి | 6.14 | 2.22 |
| తమిళనాడు | 69.69 | 40.55 |
| తెలంగాణ | 39.08 | 19.88 |

## జాతీయ స్థాయి సేల్స్ (2025-26)

| | |
|---|---|
| డీజిల్ | 947.04 |
| పెట్రోల్ | 425.86 |

## ఏపీలో సగం బంకులు క్లోజ్

తెలంగాణతో పోలిస్తే ఏపీలో డీజిల్, పెట్రోల్ ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. డీజిల్ కొరత తీవ్రంగా ఉండటంతో అక్కడి ప్రభుత్వం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకున్నది. ముఖ్యంగా వ్యవసాయం, ప్రజా రవాణా రంగాలపై దీని ప్రభావం పడకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా 4,510 పెట్రోల్ బంకులు ఉంటే.. సగం బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి.

- ఏపీలోని చాలా జిల్లాల్లో లారీలు, బస్సులు వంటి పెద్ద వాహనాలకు 200 లీటర్ల పరిమితిని విధిస్తున్నారు. మరికొన్ని చోట్ల కేవలం రూ.2,000 నుంచి రూ.5,000 విలువైన డీజిల్ మాత్రమే పోస్తున్నారు. స్టాక్ త్వరగా అయిపోకుండా ఉండేందుకు బంకుల యాజమాన్యాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి.
- ఆక్వాకల్చర్ కోసం డ్రమ్ముల్లో డీజిల్ తీసుకెళ్లడంపై ఆంక్షలు విధించారు. అత్యవసరమైతే తప్ప డీజిల్ ఇవ్వవద్దని కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు.
- ఆయిల్ కంపెనీలు డీలర్లకు ఇచ్చే క్రెడిట్ సౌకర్యాన్ని నిలిపివేయడంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో డీలర్లు స్టాక్ కొనలేకపోతున్నారని, వెంటనే పాత పద్ధతిని పునరుద్ధరించాలని కోరారు.




## తగ్గిన ప్రైవేటు బస్ సర్వీసులు


డీజిల్ కొరత కారణంగా ప్రైవేటు బస్ సర్వీసుల సంఖ్య తగ్గింది. హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, బెంగళూరు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల సంఖ్య తగ్గింది. డీజిల్ లేకపోవడంతో కొన్ని సంస్థలు తమ సర్వీసులను 20-30% వరకు రద్దు చేసుకున్నాయి.

- డీజిల్ ధర పెరగకపోయినా..కొరతను సాకుగా చూపి ప్రైవేట్ ఆపరేటర్లు టికెట్ ధరలను భారీగా పెంచేశారు. సాధారణ రోజుల్లో కంటే 30% నుంచి 50% అదనంగా వసూలు చేస్తున్నారు.
- హైవేలపై ఉన్న బంకుల్లో డీజిల్ లేకపోవడంతో, బస్సులు గమ్యస్థానానికి చేరకముందే మధ్యలో గంటల తరబడి బంకుల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో ప్రయాణ సమయం 2-3 గంటలు అదనంగా పెరుగుతోంది.

## తెలంగాణ–ఏపీ బార్డర్‌లోని బంకులు మూత

తెలంగాణ-ఏపీ సరిహద్దు జిల్లాలైన సూర్యాపేట (కోదాడ), ఖమ్మం, జోగులాంబ గద్వాల, నల్గొండ జిల్లాల్లోని బంకులు మూతపడ్డాయి. ఏపీలో డీజిల్ కొరత తీవ్రంగా ఉండటం, అక్కడ 200 లీటర్ల పరిమితి విధించడంతో, ఏపీకి వెళ్లే లారీలు, బస్సులు అన్నీ తెలంగాణ సరిహద్దుల్లోని బంకుల్లోనే ట్యాంకులు ఫుల్ చేయించుకుంటున్నాయి.

- తెలంగాణలోని బార్డర్ బంకులపై సాధారణం కంటే 4 రెట్లు ఎక్కువ ఒత్తిడి పడుతోంది. దీనివల్ల తెలంగాణ వైపు ఉన్న బంకుల్లో కూడా స్టాక్ వేగంగా అయిపోతోంది.
- కోదాడ, గరిడెపల్లి ప్రాంతాల్లోని నేషనల్ హైవేల పక్కన ఉన్న బంకుల వద్ద కిలోమీటర్ల మేర లారీలు నిలబడి ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.
- స్టాక్ ఉన్న బంకుల వద్ద గొడవలు జరగకుండా సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో పోలీసులు బంకుల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు.



# నల్గొండలో చుక్క డీజిల్ దొరకట్లే..



నల్లగొండ జిల్లాలో ఇంధన కొరత తీవ్రరూపం దాల్చుతోంది. గత రెండు మూడు రోజులుగా పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెట్రోల్, డీజిల్ కొరత సెగ సామాన్యుడి నుంచి అన్నదాత వరకు అందరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కేవలం అడ్వాన్స్ డబ్బులు కట్టినప్పటికీ స్టాక్ రాకపోవడం ఒక ఎత్తైతే, పొరుగు రాష్ట్ర వాహనాల తాకిడితో ఉన్న నిల్వలు కూడా గంటల వ్యవధిలోనే ఖాళీ అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాలతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో దాదాపు 80 శాతం పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి భారీగా వాహనాలు తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన కోదాడ, మిర్యాలగూడ, నాగార్జున సాగర్ హైవేల మీదుగా వస్తుండటంతో ఇక్కడ స్టాక్ త్వరగా అయిపోతోంది. బంకు నిర్వాహకులు ముందుగానే లక్షలాది రూపాయలు అడ్వాన్స్ చెల్లించినప్పటికీ, మూడు నాలుగు రోజులు గడుస్తున్నా స్టాక్ అందడం లేదని వాపోతున్నారు. ఒకవేళ ట్యాంకర్ వచ్చినా.. పెరిగిన డిమాండ్ దృష్ట్యా ఒక్క రోజులోనే ఖాళీ అవుతోంది. ప్రస్తుతం వరి కోతల సీజన్ కావడంతో హార్వెస్టర్ల కోసం వందల లీటర్ల డీజిల్ అవసరం ఉంటుంది. డీజిల్ దొరకకపోవడంతో పొలాల్లోనే కోతలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వలిగొండ మండలానికి కూడా తాకింది. డీజిల్ కొరత రోజు రోజుకు పెరిగిపోతుండగా వలిగొండ లోని 3 పెట్రోల్ బంకులలో సోమవారం ఉదయం నాటికి డీజిల్ పూర్తిగా ఖాళీ అయింది.



## మెదక్ జిల్లాలో పెట్రోల్ కష్టాలు

**ఉమ్మడి మెదక్ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరతతో బంకులు ఖాళీ అవుతున్నాయి. పెట్రో బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. పెట్రో నిల్వలు ఉన్న బంకుల్లో ప్రజలు క్యూ కడుతున్నారు. పెట్రోల్ కొరత ఎఫెక్ట్ తో మెదక్ జిల్లా కొల్చారం మండలం ఎనుగండ్లలోని దుంపలకుంట చౌరస్తాలోని పెట్రోల్ బంక్ వద్ద ఖాళీ క్యాన్లతో పెట్రోల్ బంకులకు వినియోగదారులు క్యూ కట్టారు. పెట్రోల్ డీజిల్ దొరుకుతుందో లేదోనని వాహనదారుల్లో ఆందోళనతో,ముందు జాగ్రత్తగా ఖాళీ డబ్బాలతో పెట్రోల్ కోసం బారులు తీరారు ప్రజలు.**






## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బంకులు బంద్

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఖమ్మం, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, వంటి పట్టణాలలో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్ర రూపం దాల్చింది. గత రెండు రోజులుగా ఇంధన సరఫరాలో ఏర్పడిన అంతరాయం కారణంగా జిల్లాలోని పలు పెట్రోల్ బంకులు వెలవెలబోతున్నాయి. ఉన్న కొద్దిపాటి స్టాక్ కోసం వాహనదారులు ఎండను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి క్యూలైన్లలో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.సోషల్ మీడియాలో యుద్ధ ప్రభావం వల్ల పెట్రోల్ కొరత అనే, వదంతులు చూసి వాహనదారులు పెట్రోల్ బంకుల బాట పట్టడంతో భారీ క్యూ లైన్లు దర్శనమిస్తున్నాయి. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో క్యాన్లు, టిన్నులతో ప్రత్యేక్షమవుతున్న వ్యవసాయ కూలీలను చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. క్యాన్లలో పెట్రోల్ నిల్వ చేసుకుంటున్నారనే అపోహలతో,అవసరం లేకపోయిన కొంత మంది ఫుల్ ట్యాంక్ చేస్తుండటం గమనార్హం. పలు చోట్ల "నో స్టాక్" బోర్డులు దర్శనమిస్తుండటం తో అంతరాష్ట్ర ప్రయాణికులు, అత్యవసర పనులపై వెళ్లే వారు మార్గమధ్యలో ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క పెట్రోల్ బంకు యజమానులు మాత్రం పెట్రోల్ సరిపోయినంత ఉంది కానీ, క్యూ లైన్ ఎక్కువ ఉండటం వలన ఆలస్యం అవుతుందని చెప్తున్నారు. సరఫరాలో అంతరాయం వల్ల కొన్ని బంకులలో నో స్టాక్ బోర్డులు పెట్టడం, తెరిచి ఉన్న పెట్రోల్ బంకులలో పెద్ద పెద్ద క్యూ లైన్లు ఉండడంతో ప్రజలు ఒకరకమైన గందరగోళంలో ఉన్నట్లు తెలుస్తోంది.